

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు..

**ఉద్యమ కెరటం, రెబ్బెన:** వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం రెబ్బెన మండల కేంద్రంలోని వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి,భద్రత నియామాలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

**అఖిల భారత ఫాసిస్టు వ్యతిరేక సదస్సు నిర్వహణ జిల్లా కన్వీనర్ తిరుపతి**



**ఉద్యమ కెరటం, జైనూర్ :** భారతదేశంలో ప్రజాస్వామ్యం, సమానత్వం, సోదరభావం విలువల పై దాడి చేస్తున్న ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని అఖిల భారత ఫాసిస్టు వ్యతిరేక సదస్సు నిర్వహణ జిల్లా కన్వీనర్ గోగర్ల తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో అఖిలభారత ఫాసిస్టు వ్యతిరేక సదస్సుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగాన్ని తిరస్కరించి, మనుస్మృతిని రాజ్యాంగంగా ప్రకటించేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. జాతిపిత మహాత్మా గాంధీని చంపి, నాథూరామ్ గాడ్సేను పూజించినది ఆర్ఎస్ఎస్ అని, 'జన గణ మన'ను తిరస్కరించి, 'వందేమాతరం'ను జాతీయ గీతం గా చెప్పడం ఎంత దౌర్భాగ్యం అని మండిపడ్డారు. భారతదేశం బహుళ సాంస్కృతిక, లౌకిక దేశం అని తిరస్కరించి, హిందూ దేశాన్ని నిర్మించడానికి ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతుందని, ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బీహార్ ఎన్నికలలో భారత ఎన్నికల కమిషన్ కూడా బీజేపి కి అనుబంధ సంస్థగా పని చేసిందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ ఫాసిజం దేశవ్యాప్తంగా వ్యాపిస్తున్న ఈ ప్రమాదకరమైన సమయంలో, మన దేశాన్ని, ప్రజలను రక్షించడం ప్రతి ఒక్క ప్రజాస్వామ్య వాది బాధ్యత అన్నారు. డిసెంబర్ 6, 2025న, బాబ్రీ మసీదు కూల్చివేత దినం, బాబా సాహెబ్ మరణించిన దినం హైదరాబాద్‌లోనీ ఎల్బీనగర్ లో అఖిల భారత ఫాసిస్ట్ వ్యతిరేక సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఈ సదస్సుకు జిల్లా నుండి ప్రజాస్వామ్యవాదులు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు దయాకర్, అనిల్, జైవంత్, అఖిల్ ఆకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శిశు మందిర్‌లో ఆర్ఎస్ఎస్ శతజయంతి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి సందర్భంగా గురువారం 'సప్తశక్తి సంగం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాది రాపర్తి గాయత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పంచాయతీ సెక్రటరీ భోగ సుమలత హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయత్రి ప్రసంగిస్తూ కుటుంబ ప్రబోధన్, భారతీయ సంస్కృతి పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. విదేశీ సంస్కృతిని విడనాడి, మన భాషా, వేష భూషణాలను కాపాడుకోవాలని ఉద్ఘాటించారు. మార జ్యోతి "యత్ర నార్యస్తు పూజ్యంతే" అనే అంశంపై భారత దేశంలో మహిళల ఉన్నతి పాత్రను వివరించారు. వైష్ణవి పంచ పరివర్తనలో స్త్రీ పాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా విశిష్ట మహిళలు సువర్ణ, జయలక్ష్మి ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వీర మహిళల వేషధారణలతో అలరించారు.

## ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి సన్మానం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం టీయూడబ్ల్యూజే ఐజేయూ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి బీజేపీ మండల నాయకులు గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఘనంగా సన్మానించారు. మండల ఐజేయూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షులుగా లింగారెడ్డిగారి అర్జున్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అరిగే రమేష్, సహాయ కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్, కోశాధికారిగా సిరిపురం అంజయ్యలతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను బుధవారం ఎన్నుకోగా, వారిని వారిని శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తొట్ల మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఎలేందర్, సీనియర్ నాయకులు పత్తి స్వామి రాజ్, నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, నరసింహులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఉద్యమ కెరటం, వాంకిడి:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని వాంకిడి మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాంకిడి, జంబుల్ ధరి గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ పత్రాలను పరిశీలించి స్టేజ్ 1 రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ స్వీకరణ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని తెలిపారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని, నామినేషన్ల కేంద్రం వద్ద రద్దీ లేకుండా చూడాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సి. ఐ., మండల పంచాయతీ అధికారి జావిద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఇటీవల నల్గొండ జిల్లా చౌటుప్పల్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో బంగారు పతకం, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీలలో, రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు పతకం, బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన 4 మంది విద్యార్థినులు రజత పతకం సాధించిన జిల్లా జట్టు కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించి జిల్లా పేరును నిలబెట్టాలని తెలిపారు. క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులకు తర్ఫీదు అందించిన కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మడావి శేషు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పుర్క ఉద్ధవ్, కోచ్ లు తిరుమల, విద్యాసాగర్, అరవింద్, పి. డి.లు మీనా రెడ్డి, గుండం లక్ష్మణ్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్నికలపై ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి విడత ఎన్నికల్లో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలను ప్రలోభపెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ అంశాలు ఎవరి దృష్టిలోకైనా వస్తే కంట్రోల్ రూమ్ నం.08736-250501కు ఫిర్యాదు చేయవచ్చని, ఇతర ఎన్నికల సంబంధిత సమాచారం కోసం సంప్రదించవచ్చని తెలిపారు.



## రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు కృషి చేయాలి

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు కృషి చేస్తూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై ఇమ్రాన్ సూచించారు. బుధ వారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గ్రామస్తులు, ధాబా సిబ్బంది, పెట్రోల్ పంపు కార్మికులు, స్థానిక యువతకు ప్రమాద నివారణ, బ్లాక్‌స్పాట్ గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో ఎస్పీ జిల్లావ్యాప్తంగా 450 రోడ్డు భద్రతా క్లబ్‌లను ప్రారంభించారని తెలిపారు. అనంతరం అత్యవసర పరిస్థితిలో గుండెపోటు వచ్చిన వెంటనే చేపట్టే సీపీఆర్ గురించి వైద్యాధికారి ఎండి సద్దాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అదేవిధంగా మన రోడ్లను సురక్షితంగా ఉంచుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారునికి ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఆర్థిక అక్షరాస్యత సహకారంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన పథకంలో అకౌంట్ కలిగి ఉన్న ఖాతాదారు పి లక్ష్మి అనే మహిళ ఇటీవల మృతిచెందింది. దీంతో ఆమెకు మంజూరైన ఇన్సూరెన్స్ డబ్బులు రూ. 2లక్షల చెక్కును ఆమె కుమారుడు టీ సాగర్ కు బ్రాంచ్ మేనేజర్ కె విశ్వేశ్వరరావు గురువారం అందజేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ మృతురాలు తాండూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలో ఖాతా కలిగి ఉందన్నారు. ప్రతిఒక్కరు ఇన్సురెన్స్ చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు సేవలు, సైబర్ నేరాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయ భాగస్వామ్యం కోసం అడుగు

**యువ అభ్యర్థుల నామినేషన్ డిపాజిట్ భరించనున్న మొహమ్మద్ ఇలియాజుద్దీన్**

**ఉద్యమ కెరటం, చెన్నూర్:** చెన్నూర్ నియోజకవర్గంలోని జైపూర్ మండలంలో గ్రామాల అభివృద్ధికి యువ నాయక త్వం అత్యవసరం అనే నినాదంతో ఇండియన్ యూత్ కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఇలియాజుద్దీన్ ఒక వినూత్న ప్రజాసేవ కార్యక్రమాన్ని ప్రకటించారు. జైపూర్ మండలంలోని 20 గ్రామాలు, 186 వార్డులలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతకు నామినేషన్ డిపాజిట్ మొత్తాన్ని ఆయన వ్యక్తిగ తంగా భరించనున్నారు. యువత రాజకీయాల్లోకి రావడా న్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఇలియాజుద్దీన్ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుండి ముందుగా సంప్రదించిన అభ్యర్థులలో, ఒకరు ఎస్సీ / ఎస్టీ / బీసీ వర్గాలకు చెందిన యువ అభ్యర్థి, మరొకరు జనరల్ వర్గానికి చెందిన యువ అభ్యర్థి చొప్పున ఎంపికవుతారు. సర్పంచ్ అభ్యర్థులకు (ఎస్సీ/ఎస్టీ/బీసీ) ₹1,000, ఇతరులకు ₹2,000బీ అలాగే వార్డ్ మెంబర్ అభ్యర్థులకు (ఎస్సీ/ఎస్టీ/బీసీ) ₹250, ఇతరులకు ₹500 చొప్పున ఆయన చెల్లించనున్నారు.

### యువశక్తితో గ్రామాభివృద్ధి

"జైపూర్ మండలంలోని గ్రామాల అభివృద్ధికి యువ శక్తి అత్యవసరం అని మొహమ్మద్ ఇలియాజుద్దీన్ అన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న యువతకు రాజకీయాల్లో పాల్గొనే ధైర్యం, అవకాశం కల్పించాలని సూచించారు. పంచాయతీ స్థాయిలో కొత్త ఆలోచనలు, కొత్త శక్తితో కూడిన నాయకత్వం రావాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పూర్తిగా ప్రజాసేవ కోణంలో చేస్తున్నదే కానీ రాజకీయ ప్రయోజనాల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. దాదాపు 20 సర్పంచ్ అభ్యర్థులు, 186 వార్డు మెంబర్ అభ్యర్థుల కోసం ఈ కార్యక్రమం ద్వారా సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. యువత ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



